డ్రెయిన్ నిర్మాణ పనులు షురూ !

- ఆక్రమణల పేరుతో గంగానమ్మ గుడి వద్ద నుంచి ప్రారంభం
- డ్రెయిన్ నిర్మాణానికి అడ్డంకిగా ట్రాన్స్‌ఫార్మర్



గంగానమ్మ గుడి వద్ద నుంచి ప్రారంభించిన డ్రెయిన్ నిర్మాణ పనులు

భవానీపురం(విజయవాడపశ్చిమ): విద్యాధరపురం కుమ్మరిపాలెం సెంటర్ నుంచి గుప్తా సెంటర్ వరకు అవుట్‌ఫాల్ డ్రెయిన్ నిర్మాణ పనులు ఎట్టకేలకు ప్రారంభమయ్యాయి. విద్యాధరపురం 39వ డివిజన్ పరిధిలో అవుట్‌ఫాల్ డ్రెయిన్ నిర్మాణానికి గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలోనే (2023) నగరపాలక సంస్థ జనరల్ ఫండ్స్ నుంచి రూ.34 లక్షలు మంజూరయ్యాయి. తిరుపాల్ అనే వ్యక్తి టెండర్ కూడా దక్కించుకున్నాడు. ఆ తరువాత ఎలక్షన్ కోడ్ అమలులోకి రావడంతో పనులు ప్రారంభించ లేదు. ఇప్పటి వరకు అడుగు ముందుకు పడని దుస్థితి. కుమ్మరిపాలెం సెంటర్ నుంచి గుప్తా సెంటర్ వరకు దాదాపు అర కిలోమీటర్ దూరం మేర అవుట్‌ఫాల్ డ్రెయిన్ నిర్మాణ పనులు ప్రారంభించక పోవడం పాలకుల నిర్లక్ష్యమేనని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాదికి ఎట్టకేలకు పనులు ప్రారంభించారు. అధికారంలోకి వస్తే నియోజకవర్గాన్ని ఎక్కడికో తీసుకు వెళతానని ఎన్నికలకు ముందు హామీలు గుప్పించి గెలిచిన స్థానిక ఎమ్మెల్యే సుజనా చౌదరి ఇన్నాళ్లూ ఏమైపోయారని ప్రశ్నిస్తున్నారు. నియోజకవర్గానికి ఆయన విజిటింగ్ ప్రొఫెసర్‌గా తయారయ్యారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

ఆక్రమణలతో ఇక్కట్లు

వాస్తవానికి కుమ్మరిపాలెం సెంటర్ నుంచి అవుట్‌ఫాల్ డ్రెయిన్ నిర్మాణం మొదలు పెట్టాల్సి ఉండగా అక్కడ తవ్వాల్సిన ప్రాంతంలో ఆక్రమణలు(సైడు కాలువపై కట్టిన సిమెంట్ చప్టాలు) అడ్డుగా ఉన్నాయని అధికారులు చెబుతున్నారు. అక్కడ వదిలేసి గంగానమ్మ గుడి దగ్గర నుంచి మొదలు పెట్టి స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా భవనం వరకు పనులు చేపట్టారు. ఈ మధ్యలో మెయిన్ రోడ్ వైపునకు ఒరిగిపోయి ఎప్పుడు పడిపోతుందో తెలియని ప్రమాదకర పరిస్థితుల్లో ఒక విద్యుత్ స్తంభం, ఇంకొంచెం ముందుకు వెళితే(ఎస్‌బీఐ వద్ద) ట్రాన్స్‌ఫార్మర్ అడ్డంకిగా తయారవ్వటంతో అధికారులు తలలు పట్టుకుంటున్నారు. విద్యుత్ శాఖ అధికారులు వచ్చి వాటిని వెనక్కో, ముందుకో జరిపితే తప్ప డ్రెయిన్ నిర్మాణం సజావుగా జరుగుతుంది. లేదంటే వాటిని అలానే వదిలేసి వంకర టింకరగా కట్టుకుంటూ వెళ్లిపోయే అవకాశం లేక పోలేదు. ఎస్‌బీఐ భవనం తరువాత నుంచి గుప్తా సెంటర్ అనేక ఆక్రమణలు ఉన్నాయి. వాటన్నింటిని అధిగమించి గుప్తా సెంటర్ వరకు డ్రెయిన్ నిర్మాణాన్ని ఎలా పూర్తి చేస్తారన్నది ప్రశ్నార్థకమే.



అవుట్‌ఫాల్ డ్రెయిన్ నిర్మాణానికి అడ్డంకిగా ఉన్న కాలువపై చప్టాలు



ఎస్‌బీఐ బిల్డింగ్ వద్ద డ్రెయిన్‌కు అడ్డుగా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్

నేటి నుంచి శ్రీవారి బ్రహ్మోత్సవాలు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): శ్రీ పద్మావతి, గోదాదేవి సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి వారి బ్రహ్మోత్సవాలను బుధవారం నుంచి ఐదు రోజుల పాటు అంగరంగ వైభవంగా నిర్వహిస్తామని ఆలయ కమిటీ కార్యదర్శి మరుపిళ్ల హనుమంతరావు, కోశాధికారి పిళ్లా శ్రీనివాసరావు చెప్పారు. చిట్టినగర్‌లోని శ్రీ మహాలక్ష్మి అమ్మవారి దేవస్థాన కల్యాణ మండపంలో మంగళవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉత్సవాలకు సంబంధించి కరపత్రాలను నిర్వాహకులు, ఆలయ అర్చకుడు వినుకొండ రత్నమాచార్యులు ఆవిష్కరించారు. ఐదు రోజుల పాటు ఉత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. ఆలయ ప్రాంగణంలో హోమాలను నిర్వహించేందుకు హోమగుండాలు, కల్యాణ వేదికను సిద్ధం చేశామని చెప్పారు. 13వ తేదీన జరిగే స్వామి వారి కల్యాణోత్సవానికి పెద్ద ఎత్తున పుర ప్రముఖులు, రాజకీయ నాయకులు, వివిధ రంగాలకు చెందిన వారు విచ్చేస్తారన్నారు. ఆలయ ప్రాంగణంలో ప్రత్యేక క్యూలైన్లతో పాటు అమ్మవారి ఆలయాన్ని, స్వామి వారి ఆలయాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించానన్నారు. బ్రహ్మోత్సవాల్లో భక్తులు పాల్గొనాలని కోరారు. సమావేశంలో పొట్నూరి దుర్గాప్రసాద్(రాజా), కామందుల నరసింహారావు, తమ్మిన సూర్యకుమారి, మజ్జి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



బ్రహ్మోత్సవాల కరపత్రాలను ఆవిష్కరిస్తున్న కమిటీ సభ్యులు

డ్రెయిన్లలో సిల్టును త్వరగా తొలగించాలి

పటమట(విజయవాడతూర్పు): వర్షాకాలం దృష్ట్యా డీసిల్టింగ్ పనులను శరవేగంగా పూర్తి చేయాలని వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర అధికారులను ఆదేశించారు. నగర పర్యటనలో భాగంగా ఆయన మంగళవారం నగరంలోని సర్కిల్–3 పరిధిలోని పలు ప్రాంతాల్లో పర్యటించారు. డ్రెయిన్ల అన్నింటిలోనూ డీసిల్టింగ్ పనులు పూర్తయినప్పటికీ, అవసరమైన చోట మళ్లీ డీసిల్టింగ్ ప్రక్రియను చేపట్టాలన్నారు. ఈ సందర్భంగా పటమట హైస్కూలు రోడ్డులో ఉన్న అన్న క్యాంటీన్‌ను సందర్శించారు. అన్న క్యాంటీన్‌లో పారిశుద్ధ్య నిర్వహణలో ఎటువంటి లోపం లేకుండా చూసుకోవాలని, ఆహారం ఉన్న చోట ఈగలు, అపరిశుభ్రమైన వాతావరణం లేకుండా ఎప్పటికప్పుడు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. తాగునీటి, వాడుక నీటి సరఫరా నిరంతరం ఉండేటట్టు అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తుండాలన్నారు. అనంతరం ఆయన కనకదుర్గానగర్‌లో నూతనంగా నిర్మిస్తున్న వాటర్ ట్యాంక్‌ను పరిశీలించారు. నిర్మాణ పురోగతిపై ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్‌ను అడిగి తెలుసుకుని ఎటువంటి ఇబ్బందులు ఉన్నా వెంటనే తమకు తెలియజేయాలన్నారు. మహానాడు రోడ్డు పంట కాలువ రోడ్డులో పర్యటించి పారిశుద్ధ్యను నిర్వహణ పరిశీలించారు. రోడ్డుపై ఉన్న వ్యర్థాలను ఎప్పటికప్పుడు తొలగించాలని, ప్రతి రోజు రోడ్లను శుభ్రపర్చి, విజయవాడ నగరాన్ని పరిశుభ్రమైన నగరంగా ఉంచాలని చెప్పారు. ఈ పర్యటనలో ఇన్‌చార్జి చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ గోపాలకృష్ణ నాయక్, పర్యవేక్షణ ఇంజినీర్ పి.సత్యనారాయణ, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ జి.సామ్రాజ్యం తదితరులు పాల్గొన్నారు.



కనకదుర్గానగర్‌లో అధికారులకు సూచనలిస్తున్న వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర

బదిలీల్లో లాక్ సూపరింటెండెంట్స్‌కు అన్యాయం

మధురానగర్(విజయవాడసెంట్రల్): ఇటీవల నిర్వహించిన ఏపీ ఇరిగేషన్ లాక్ సూపరింటెండెంట్స్ బదిలీల్లో కొంతమందికి తీవ్ర అన్యాయం జరిగిందని, పట్టణాల్లో ఉన్నవారు పట్టణాల్లోనే ఉండగా, పల్లెలో ఉండేవారిని పల్లెలకే పరిమితం చేశారని ఏపీ ఇరిగేషన్ లాక్ సూపరింటెండెంట్స్ అసోసియేషన్ ఏపీ ప్రధాన కార్యదర్శి బి.ప్రసాదబాబు ఆవేదన వ్యక్తం చేశారు. స్థానిక ముత్యాలంపాడు జీఎస్ రాజు రోడ్డులోని ఏపీ ఇరిగేషన్ లాక్ సూపరింటెండెంట్స్ అసోసియేషన్ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎంతో కాలంగా పట్టణాల్లో పనిచేస్తున్న వారిని పట్టణాల్లోనే ఉంచగా, ఎంతో కష్టనష్టాలకు ఓర్చి పల్లెల్లో మారుమూల ప్రాంతాల్లో విధులను నిర్వహిస్తున్న వారిని పల్లె ప్రాంతాలకే పరిమితం చేశారని విచారం వ్యక్తం చేశారు. ఒకే సెక్షన్‌లో 20 సంవత్సరాలుగా పనిచేస్తున్న వారిని ఎటువంటి బదిలీ చేయకుండా కొంతమందిని ఒకే సెక్షన్‌లో పరస్పర బదిలీలతో సరిపెట్టారని అన్నారు. మ్యూచువల్ పెట్టుకున్న కొంత మంది లాక్ సూపరింటెండెంట్‌లను, మహిళలను ఇష్టం వచ్చిన విధంగా బదిలీ చేశారని విచారం వ్యక్తం చేశారు. నీటి పారుదల వ్యవస్థలో అతి కీలకమైన లాక్ సూపరింటెండెంట్‌లకు ఎటువంటి కనీస సదుపాయాలు లేకపోయినప్పటికీ 24 గంటలు లాక్ అవసరాలను కనిపెట్టుకుని పనిచేస్తున్నామన్నారు. అధికారులకు, రైతులకు అందుబాటులో ఉంటూ నీటిని సరఫరా చేస్తున్నామని, వరదల సమయంలో విషసర్పాల మధ్య ప్రమాదకర వాతావరణంలో విధులను నిర్వహిస్తున్నామన్నారు. అన్యాయం జరిగిన లాక్ సూపరింటెండెంట్‌లకు మానవతా దృక్పథంతో వారి సమస్యలను అర్థం చేసుకుని డైవర్షన్ చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ నాయకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ప్రసాదబాబు

అమరావతిలో ఘంటసాల విగ్రహాన్ని ఏర్పాటు చేయాలి



విజయవాడకల్చరల్: ఏపీ రాజధాని అమరావతిలో అమర గాయకుడు ఘంటసాల విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని తెలుగు కళావాహిని అధ్యక్షుడు చింతకాయల చిట్టిబాబు కోరారు. తెలుగు కళావాహిని, శ్రీ కళాభారతి, పోలవరపు సాహితీ పీఠం, ఘంటసాల చైతన్య వేదిక ఆధ్వర్యంలో గాంధీనగర్‌లోని కొత్తా పూర్ణానందం కళావేదిక మీద మంగళవారం సినీ సంగీత విభావరి, జిల్లా స్థాయి ఘంటసాల అభిమానుల ఆత్మీయ సమావేశ కార్యక్రమాన్ని నిర్వహించారు. చిట్టిబాబు మాట్లాడుతూ కృష్ణానది కరకట్టమీద తెలుగు సాహితీ మూర్తుల విగ్రహాలను ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఘంటసాల చైతన్యవేదిక అధ్యక్షుడు కోట వెంకటేశ్వరరెడ్డి మాట్లాడుతూ సాంస్కృతిక కళా సంస్థలు కళాకారుల సంక్షేమం కోసం కృషి చేయాలని సూచించారు. సాంస్కృతిక సంస్థల ప్రతినిధులు కె.డేవిడ్‌రాజు, టి.శ్రీనివాసరెడ్డి, బీవీ వీరభద్రరావు, గోళ్ళ నారాయణరావు, సాహితీవేత్త ప్రభాకర్ పాల్గొన్నారు. గాయనీ గాయకులు పలు తెలుగు, హిందీ చిత్ర గీతాలను ఆలపించారు.

ముందస్తు సమాచారం లేకుండా నీటి సరఫరా బంద్

భవానీపురం(విజయవాడపశ్చిమ): బాధ్యతా రహితంగా, నిర్లక్ష్యంగా వ్యవహరించిన నగరపాలక సంస్థ అధికారుల కారణంగా జక్కంపూడి వైఎస్సార్ కాలనీ ప్రజలు తాగునీటి కష్టాలను ఎదుర్కోవలసి వచ్చింది. ముందస్తుగా పత్రికా ప్రకటన విడుదల చేసిన మరుసటి రోజు తాగునీటి సరఫరాను నిలుపుదల చేయాల్సిన అధికారులు మంగళవారం తెల్లవారు జామున 6 గంటలకు వీఎంసీ లోకల్ మీడియా గ్రూప్‌లో వాట్సప్ మెసేజ్ పెట్టారు. వాటర్ ట్యాంకుల ద్వారా జక్కంపూడికి తాగునీటి సరఫరా అన్నది ఆ మెసేజ్ సారాంశం. ఆ విషయం పత్రికా ముఖంగా ప్రచురితమైతే కాలనీవాసులు జాగ్రత్త పడేవారు. అందుకు విరుద్ధంగా సంబంధిత అధికారులు మంగళవారం తెల్లవారుజామునే ప్రకటన విడుదల చేసి అదే రోజు ట్యాంకర్ల ద్వారా సరఫరా చేసే విషయం కాలనీవాసులకు ఎలా తెలుస్తుందన్నది అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనంగా నిలుస్తుంది. ముందస్తు సమాచారం లేకపోవడంతో జక్కంపూడి వైఎస్సార్ కాలనీ ప్రజలు మంచినీరు సరఫరా కాకపోవడంతో ఆందోళనకు గురయ్యారు. ఎప్పటికోగానీ ట్యాంకర్ల ద్వారా తాగునీటిని సరఫరా చేయడంతో నానా అవస్థలు పడ్డారు. కాలనీలోకి ట్యాంకర్ల ద్వారా మంచినీళ్లు అందిస్తున్నారని తెలిసి మహిళలు, పురుషులు బిందెలు, వాటర్ టిన్‌లు పట్టుకుని క్యూలైన్‌లో నిలబడి నీళ్లు పట్టుకున్నారు. జక్కంపూడి ఈఎల్ఎస్ఆర్ ఔట్‌లెట్‌లో మరమ్మతుల కారణంగా మంగళవారం ఉదయం, సాయంత్రం తాగునీటి సరఫరా నిలిపివేస్తున్నామని, బుధవారం ఉదయం యథావిధిగా పైప్ లైన్ల ద్వారా తాగునీరు సరఫరా చేస్తారన్నది మంగళవారం తెల్లవారు జామున విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు.



వైఎస్సార్ కాలనీలో ట్యాంకర్ నీటిని పట్టుకుంటున్న కాలనీవాసులు

రథం సెంటర్ వద్ద సేవా కేంద్రం

ఆక్రమణల తొలగింపునకు ఈవో ఆదేశాలు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): కనకదుర్గానగర్, రథం సెంటర్ మధ్య ఉన్న దేవస్థానం స్థలంలో ఆక్రమణలను తొలగించడంతో పాటు ఆ ప్రాంతంలో సేవా కేంద్రం ఏర్పాటు చేయాలని ఈవో శీనానాయక్ ఆదేశాలు జారీ చేశారు. కనకదుర్గానగర్, రథం సెంటర్ వద్ద ఉన్న ఆక్రమణలను మంగళవారం దేవస్థాన అధికారులు పరిశీలించారు. దేవస్థానానికి విరాళాల చెల్లింపు, ఆలయ సమాచారం, సేవా టికెట్ల బుకింగ్ వంటి పనులను భక్తులు నేరుగా సేవా కేంద్రం నుంచి పొందవచ్చునన్నారు. సేవా టికెట్ల కోసం మహా మండపం, ఘాట్‌రోడ్డు మీదుగా కొండపైకి చేరడం ఇబ్బందికరంగా ఉందని పలువురు భక్తులు ఆలయ అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. ఈ నేపథ్యంలో ఆలయ ఈవో, దేవస్థానానికి చెందిన ఇంజినీరింగ్, పరిపాలనా విభాగం అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలన చేసి సేవా కేంద్రం ఏర్పాటుపై చర్చించారు. కార్యక్రమంలో ఏఈవో ఎస్.రమేష్‌బాబు, పి.చంద్రశేఖర్, బీవీ రెడ్డి, డీఈ రవీంద్ర, డీవీవీ సత్యనారాయణ, నగేష్ తదితరులు పాల్గొన్నారు.



సేవా కేంద్రం ఏర్పాటుకు స్థల పరిశీలన చేస్తున్న ఈవో శీనానాయక్, అధికారులు

యోగాంధ్ర సాధన అందరి బాధ్యత

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): యోగాంధ్ర సాధనకు పౌరులందరి బాధ్యత అని కేబీఎన్ కళాశాల అధ్యక్ష, కార్యదర్శులు ఉసిరిక ఉమామహేశ్వరరావు, టి.శ్రీనివాసులు అన్నారు. యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా మంగళవారం ఆ కళాశాల ఫిజికల్ ఎడ్యుకేషన్, ఎన్ఎస్ఎస్ విభాగాల సంయుక్త ఆధ్వర్యంలో 1,500 మంది విద్యార్థులతో యోగసాధన కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ కళాశాల విద్యా ప్రణాళికలో యోగాను భాగంగా చేర్చామని, నిత్యం ప్రతి విద్యార్థి యోగసాధన చేసేలా టైంటేబుల్ అమలు చేస్తున్నామన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి.కృష్ణవేణి, హిందూ హైస్కూల్స్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ డాక్టర్ వినారాయణరావు మాట్లాడుతూ.. నూతన విద్యావిధానం కూడా యోగాను చదువులో భాగం చేయాలని సూచిందన్నారు. ఫిజికల్ ఎడ్యుకేషన్ విభాగాధిపతి డి.హేమచంద్రరావు, యోగ శిక్షకులు గౌరీనాథ్ విద్యార్థులతో యోగ సాధన చేయించారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు బీవీ బాలకోటేశ్వరరావు, వైస్ ప్రిన్సిపాల్స్ డాక్టర్ కె.రామకృష్ణ, పీఎల్ రమేష్, డాక్టర్ వెంకటేశ్వరరావు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ డి.పవన్ కుమార్, ఎం.శాంతిబాబు, పి.గౌతమీదేవి, ఎస్.సాంబశివరావు పాల్గొన్నారు.



యోగాసనాలు వేస్తున్న విద్యార్థులు

పాత గొడవల నేపథ్యంలో వివాదం

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): పాత గొడవల నేపథ్యంలో యువతిని కత్తితో బెదిరింపులకు పాల్పడిన ఘటనపై కొత్తపేట పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం పెదవడ్లపూడికి చెందిన షేక్. ఫాతిమా జహీరా(21) సోమవారం రాత్రి బంధువులను రైలు ఎక్కించేందుకు కారులో విజయవాడ బయలుదేరింది. వెస్ట్ బుకింగ్ వద్ద బంధువులను దింపిన తర్వాత పరిచయస్తులైన అల్తాఫ్ రహిమాన్, ఫర్హాన్, అతుల్ రెహమాన్‌లు కారులోకి బలవంతంగా ఎక్కారు. కారులో ఉన్న జహీరాను వెనుక నుంచి కత్తి పెట్టి పంజా సెంటర్ వైపు వెళ్లాలని బెదిరించారు. పంజా సెంటర్ చేరిన తర్వాత జనాన్ని చూసి గట్టిగా కేకలు వేయడంతో చుట్టుపక్కల వారు వచ్చి జహీరాను కాపాడారు. గతంలో మంగళగిరి పోలీస్ స్టేషన్‌లో పెట్టిన కేసు వెనక్కి తీసుకోవాలని బెదిరింపులకు దిగడంతో బాధితురాలు పోలీసులు ఫిర్యాదు చేసింది. ఘటనపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

కౌంటర్ కేసు నమోదు

అక్రమంగా ఇంట్లోకి ప్రవేశించడమే కాకుండా దూషించిన ఫాతిమా జహీరాపై కరీంనగర్‌కు చెందిన అతుల్ రెహమాన్ పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కౌంటర్ కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం రెహమాన్ రెండో కుమారుడు అల్తాఫ్ ఉల్ రెహమాన్ తన స్నేహితుడి ద్వారా పరిచయమైన ఫాతిమా జహీరా కొంతకాలంగా ప్రేమించుకున్నారు. అనంతరం మనస్పర్థలు రావడంతో మంగళగిరి పోలీస్ స్టేషన్‌లో అల్తాఫ్ ఉల్ రెహమాన్‌తో పాటు అతని తల్లిదండ్రులపై పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఇదే విషయంలో ఫాతిమా జహీరా తండ్రి జలీల్ పలు మార్లు బెదిరింపులకు పాల్పడ్డారు. బక్రీద్ నేపథ్యంలో అత్త గారి ఇంటికి వచ్చిన అతుల్ రెహమాన్, ఇతర కుటుంబ సభ్యులను పంజా సెంటర్ వచ్చి అక్రమంగా ఇంట్లోకి ప్రవేశించి దూషించింది. దీంతో ఘటనపై బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కౌంటర్ కేసు నమోదు చేశారు.

ఫ్యాక్టరీల చట్ట సవరణ బిల్లులో మార్పులను ఉపసంహరించాలి

భారతీయ మజ్దూర్ సంఘ్ డిమాండ్

మధురానగర్(విజయవాడసెంట్రల్): ఫ్యాక్టరీల చట్టం 2025లో చేసిన మార్పులను వెంటనే రాష్ట్ర ప్రభుత్వం ఉపసంహరించాలని భారతీయ మజ్దూర్ సంఘ్ ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి మేకల వెంకటేశ్వరరావు మంగళవారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. ప్రస్తుత కార్మిక చట్టాలను సవరించటానికి చేపట్టిన ఏపీ ఫ్యాక్టరీల సవరణ బిల్లు 2025ను తాము తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని అన్నారు. ఈ సవరణల ద్వారా గరిష్ఠ రోజువారీ పనిగంటలను 9 నుంచి 10 గంటలకు పెంచటం, విశ్రాంతి విరామానికి ముందు పని సమయం 5 గంటల నుంచి 6 గంటలకు పెంచటం, ప్రతీ త్రైమాసికంలో ఓవర్‌టైమ్ పరిమితిని 50 నుంచి 144 గంటలకు పెంచటం, మహిళా కార్మికులు సేఫ్‌గార్డులతో రాత్రి షిఫ్టుల్లో పనిచేయటానికి అనుమతించటం జరుగుతుందన్నారు. ఈ మార్పుల వల్ల ఉద్యోగుల శ్రేయస్సు, ఆరోగ్యం, కుటుంబ వ్యవస్థ, ఉద్యోగుల భవిష్యత్తుపై ప్రత్యక్ష ప్రభావాన్ని చూపుతాయని విచారం వ్యక్తం చేశారు. ఓవర్ టైమ్ పెంపు వల్ల కొత్త ఉపాధి అవసరాలపై తీవ్రమైన ప్రభావాన్ని చూపుతుందని, భవిష్యత్ తరం ఉద్యోగ అవకాశాలకు అతి పెద్ద అడ్డంకిగా మారుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఏపీ ఫ్యాక్టరీల సవరణ బిల్లు 2025లో చేసిన మార్పులను ఉపసంహరించుకోవాలని ఆయన కోరారు.

వివాహిత అదృశ్యంపై కేసు నమోదు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): వివాహిత అదృశ్యమైన ఘటనపై ఆమె భర్త ఇచ్చిన ఫిర్యాదు మేరకు కొత్తపేట పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కొత్తపేట నెహ్రూబొమ్మ సెంటర్ రాజగిరి వారి వీధికి చెందిన పోలవరపు రమణ, మధు(45)లు భార్యాభర్తలు. వీరికి ముగ్గురు సంతానం. ఈ నెల 8వ తేదీన సాయిరాం థియేటర్ వద్ద ఉన్న పెద్ద కుమారుడి ఇంటికి మధు వెళ్లింది. మధ్యాహ్నం 3 గంటలకు మధు తమ ఇంటికి బయలుదేరి వెళ్లింది. సాయంత్రం పని నుంచి ఇంటికి వచ్చిన రమణ ఇంట్లో భార్య మధు కనిపించకపోవడంతో పెద్దబ్బాయికి ఫోన్ చేసి అడిగాడు. మధ్యాహ్నమే ఇంటికి వెళ్లిపోయిందని చెప్పగా బంధువులు, స్నేహితులను ఆరా తీసినా ప్రయోజనం లేకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఘటనపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

సమన్వయంతో పనిచేసి మెరుగైన సేవలందించాలి

పటమట(విజయవాడతూర్పు): ఎన్టీఆర్ జిల్లాలోని హెచ్ఐవీ, ఎయిడ్స్, క్షయ, స్వచ్ఛంద సంస్థల సిబ్బంది సమన్వయంతో పనిచేసి మరింత మెరుగైన సేవలు అందించాలని జిల్లా అదనపు వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ జూపూడి ఉషారాణి సూచించారు. బెంజిసర్కిల్ సమీపంలోని వాసవ్య మహిళా మండలి సమావేశ మందిరంలో మంగళవారం ఎన్టీఆర్ జిల్లాలోని హెచ్ఐవీ, ఎయిడ్స్, క్షయ విభాగాల సిబ్బంది, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులతో సమీక్షా సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆమె ఉద్యోగుల పనితీరును సమీక్షించారు. నాకో, ఏపీశాక్స్ ఇచ్చిన ఆదేశాల మేరకు ఉద్యోగులు పని చేయాలని సూచించారు. దిశ క్లస్టర్ ప్రోగ్రామ్ మేనేజర్ డాక్టర్ శ్యాంసన్ మాట్లాడుతూ.. అన్ని విభాగాల సిబ్బంది కలిసిమెలసి పనిచేసి ఆరోగ్యకర సమాజ స్థాపనకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో వాసవ్య మహిళా మండలి, షేర్ ఇండియా, వీహెచ్ఎస్, విహాన్, రైడ్స్, ఐసీటీసీ, ఏఆర్టీ సెంటర్ కౌన్సిలర్లు, డేటా మేనేజర్లు, షేర్ ఇండియా ప్రతినిధులు జాన్ వెస్లీ, కృష్ణమూర్తి, క్షయ విభాగం సిబ్బంది పాల్గొన్నారు.

క్లుప్తంగా

కౌన్సిల్ అజెండాపై వీఎంసీ కమిషనర్ సమీక్ష



పటమట(విజయవాడతూర్పు): విజయవాడ నగరపాలక సంస్థ సర్వసభ్య సమావేశం ఈ నెల 13వ తేదీన నిర్వహిస్తున్నందున కౌన్సిల్ ముందుకు వచ్చే అజెండా అంశాలపై వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. వీఎంసీ ప్రధాన కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ రూంలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో విజయవాడ నగరాభివృద్ధికి ప్రజా ప్రతినిధులు పొందుపరిచిన సాధారణ సర్వసభ్య సమావేశపు అజెండాలో అంశాలను క్షుణ్ణంగా పరిశీలించాలన్నారు. వాటిపై ప్రస్తుతం ఉన్న స్థితిగతులు, తీసుకోవాల్సిన చర్యలు పూర్తిస్థాయిలో తెలుసుకోవాలని సూచించారు. జోన్ల వారీగా అభివృద్ధి పనులు, ప్రజలకు అందించాల్సిన మౌలిక సదుపాయాలు, కౌన్సిల్ అజెండా ప్రతిపాదనలపై పూర్తి స్థాయిలో అవగాహన కలిగి ఉండాలని చెప్పారు.

షాపుల వేలం పారదర్శకంగా నిర్వహించాలి



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): మహా మండపం 5వ అంతస్తులో దేవస్థాన షాపుల వేలం ప్రక్రియ పారదర్శకంగా నిర్వహించాలని ఈవో శీనానాయక్ ఆలయ అధికారులను ఆదేశించారు. మహామండపం నాల్గో అంతస్తులోని ఈవో చాంబర్‌లో దేవస్థాన అధికారులతో ఆయన సమావేశమయ్యారు. కనకదుర్గానగర్, గోశాల, గోశాల ఎదుట ఉన్న దేవస్థాన షాపులకు 11, 12వ తేదీలలో సీల్డ్ టెండర్, బహిరంగ వేలం ప్రక్రియను పారదర్శకంగా చేపట్టాలని సూచించారు. అదే విధంగా టెండర్ ప్రక్రియను పర్యవేక్షించేందుకే 11 మంది అధికారులతో కమిటీని ఏర్పాటు చేశామన్నారు. 19 షాపులకు పెద్ద మొత్తంలో టెండర్లు పడే అవకాశం ఉందని పేర్కొన్నారు. సమావేశంలో ఆలయ ఏఈవో రమేష్‌బాబు, సీసీ రెడ్డి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఆర్‌పీఐ నేత రామిశెట్టి గుండెపోటుతో మృతి



కృష్ణలంక(విజయవాడ తూర్పు): రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా(ఆర్‌పీఐ) ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ రామిశెట్టి రమేష్‌కుమార్(45) గుండెపోటుతో మృతి చెందారు. కృష్ణలంక ప్రాంతానికి చెందిన ఆయన సోమవారం హైదరాబాద్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో పాల్గొన్న సమయంలో గుండెపోటు రావడంతో తుదిశ్వాస విడిచారు. పార్టీ నిర్ణయం మేరకు పార్థివదేహాన్ని కృష్ణలంక, 22వ డివిజన్ సత్యంగారి దొడ్డి సమీపంలోని ఆయన నివాసం వద్ద ప్రజల సందర్శనార్థం ఉంచారు. పార్టీ జాతీయ అధ్యక్షుడు రామ్‌దాస్ అథవాలే ఫోన్‌లో రమేష్ కుటుంబ సభ్యులతో మాట్లాడి ప్రగాఢ సానుభూతి తెలిపారు.

నష్ట పరిహారం చెల్లించాలి

మైలవరం: మైలవరం మండలం చంద్రాల గ్రామంలో ఆర్అండ్‌బీ రహదారి విస్తరణలో ఇళ్లు కోల్పోయిన వారికి వెంటనే నష్టపరిహారం చెల్లించాలని బాధితులు విజ్ఞప్తి చేశారు. మంగళవారం మైలవరం తహసీల్దార్ కార్యాలయం ముట్టడికి బాధితులు ప్రయత్నించారు. చంద్రాల గ్రామానికి చెందిన 65 మంది ఇళ్లు, మరి కొంత మంది ఇళ్ల స్థలాలు కోల్పోయారు. 2016–17 సంవత్సరంలో రోడ్డు విస్తరణ పనులు జరిగాయి. దీనికి సంబంధించి బాధితులకు సుమారు రూ.6.75 కోట్లు నష్ట పరిహారం చెల్లించాల్సి ఉంది. నాటి నుంచి నేటి వరకు నష్టపరిహారం అందకపోవడంతో వారు తహసీల్దార్ కార్యాలయం వద్ద సీపీఎం ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమం చేపట్టారు. సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు పీవీ ఆంజనేయులు, మండల కార్యదర్శి సీహెచ్ సుధాకర్ మాట్లాడుతూ నాడు మంత్రిగా ఉన్న దేవినేని ఉమామహేశ్వరరావు గానీ, నేడు ఎమ్మెల్యేగా ఉన్న వసంత వెంకట కృష్ణప్రసాద్ కానీ, స్థానిక ప్రజాప్రతినిధులు కానీ దీనిపై స్పందించకపోవడం దుర్మార్గమన్నారు. తహసీల్దార్ కలెక్టర్ సమావేశంలో ఉన్నానని, 15 రోజులు గడువు కావాలని బాధితులకు సొమ్ములు జమయ్యేలా చర్యలు తీసుకుంటానని కార్యాలయంలోని డెప్యూటీ తహసీల్దార్, ఆర్ అండ్ బీ అధికారుల ద్వారా హామీ ఇచ్చారు. నాయకులు వజ్రాల వెంకటరెడ్డి, శివప్రసాద్, అనిల్, గ్రామస్తులు పాల్గొన్నారు.

మహిళ అదృశ్యంపై ఫిర్యాదు

పాయకాపురం(విజయవాడరూరల్): బెంజిసర్కిల్ వద్ద ఇంట్లో పనిమనిషిగా పని చేస్తున్న పల్లపు సుబ్బులు(39) అనే మహిళ పనికి వెళ్లి తిరిగి రాలేదని వచ్చిన ఫిర్యాదుపై నున్న పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం పాయకాపురం కండ్రికకు చెందిన పల్లపు సుబ్బులు బెంజిసర్కిల్ వద్ద ఓ ఇంట్లో పనిమనిషిగా పని చేస్తోంది. ప్రతి రోజూ ఉదయం 6 గంటలకు వెళ్లి 12 గంటలకు ఇంటికి తిరిగి వచ్చేది. ఈ నెల 5వ తేదీన పనికి వెళ్లిన సుబ్బులు ఇంటికి తిరిగి రాలేదని ఆమె భర్త పల్లపు ఆదినారాయణ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.